AKSHARA TODAY


# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN

10-11-2025 (Monday) — MAIN EDITION

## రోడ్డు ప్రమాదంలో హాకీ క్రీడాకారిణి దుర్మరణం





**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** లక్నోలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హాకీ క్రీడాకారిణి జూలీ యాదవ్ (23) దుర్మరణం పాలయ్యారు. లక్నోలోని ఎల్‌పీఎస్ స్కూల్‌లో క్రీడా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న జూలీ, ఇంటర్‌స్కూల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పర్యవేక్షణకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పారా పోలీస్ స్టేషన్ పరిధిలోని మౌడా మోడ్ సమీపంలో ఆమె ప్రయాణిస్తున్న హోండా షైన్ బైక్‌ను గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న ట్రక్కు ఢీకొట్టింది. తీవ్ర గాయాల పాలైన జూలీని అంబులెన్స్ ద్వారా ట్రామా సెంటర్‌కు తరలించినా.. ఆస్పత్రి చేరుకునేలోపే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

## విమానానికి బాంబు బెదిరింపు..




**అక్షరటుడే, హైదరాబాద్:** బ్రిటిష్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. బ్రిటిష్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానం సోమవారం ఉదయం లండన్ నుంచి శంషాబాద్ వచ్చింది. అయితే విమానం గాలిలో ఉండగానే.. బాంబు ఉన్నట్లు మెయిల్ వచ్చింది. అప్రమత్తమైన అధికారులు పైలెట్‌కు సమాచారం ఇవ్వడంతో ఎయిర్‌పోర్టులో ల్యాండ్ చేశారు. అనంతరం బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు కనిపించలేదు.

## స్పీకర్‌పై కోర్టు ధిక్కార పిటిషన్..



**అక్షరటుడే, హైదరాబాద్:** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో కోర్టు ఆదేశాలను పట్టించుకోలేదని సుప్రీంలో పిటిషన్ వేసింది. న్యాయస్థానం ఇచ్చిన గడువు ముగిసినా స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బీఆర్ఎస్ పిటిషన్‌పై సుప్రీం వచ్చే సోమవారం విచారించనుంది.

## వందేమాతరం తప్పనిసరి




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉత్తరప్రదేశ్‌లోని అన్ని విద్యాసంస్థల్లో ఇకపై వందేమాతరం గేయాలాపనను తప్పనిసరి చేస్తున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రకటించారు. విద్యాసంస్థల్లో జాతీయ గీతాలాపన చేయడం వల్ల విద్యార్థుల్లో చిన్నప్పటినుంచే దానిపై గౌరవం, దేశభక్తి ఏర్పడతాయన్నారు.

## యూఎస్‌లో ముగింపు దిశగా షట్‌డౌన్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికాలో నెలకొన్న ప్రభుత్వ షట్‌డౌన్ మేఘాలు వీడిపోనున్నాయి. దీనికి అనుకూలంగా నేడు ఆ దేశ సెనెట్‌లో ఓటింగ్ జరిగింది. కొందరు డెమోక్రాట్లు కూడా అనుకూలంగా ఓటు వేయడంతో 40 రోజుల పాటు నిలిచిపోయిన ప్రభుత్వ కార్యకలాపాలు తిరిగి ప్రారంభం కానున్నాయి.

# రేపే పోలింగ్



■ జూబ్లీహిల్స్‌లో ముగిసిన ప్రచారం ■ ప్రలోభాల పర్వానికి తెరలేపిన పార్టీలు ■ విజయంపై అన్ని పార్టీల ధీమా

**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ రేపే జరుగనుంది. ఇప్పటికే ప్రచార పర్వం ముగియగా.. ప్రలోభాల పర్వానికి తెర లేచింది. ఆయా పార్టీలు ఓటర్లను ఆకట్టుకునే పనిలో పడ్డాయి. ఈ ఉప ఎన్నిక అభ్యర్థులతో పాటు పలువురు నేతలకు పరీక్షగా మారింది. ఈ విజయం ఆయా పార్టీలకు కీలకం కానుంది. మూడు ప్రధాన పార్టీల భవితవ్యం ఎన్నికల ఫలితాలపై ఆధారపడి ఉంది. స్థానిక ఎన్నికల్లో సైతం దీని ప్రభావం ఉండనుంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉప ఎన్నికలపై చర్చ జరుగుతోంది. దీంతో ఎవరు గెలుస్తారని ప్రజలు చర్చించుకుంటున్నారు.**

**–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**

జూబ్లీహిల్స్ స్థానానికి మంగళవారం ఉప ఎన్నిక జరగనుంది. ప్రధాన పార్టీలు ఇప్పటికే జోరుగా ప్రచారం చేశాయి. ఇంటింటికి వెళ్లి నాయకులు ఓటర్లను కలిశారు. తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని వేడుకున్నారు. ఉప ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీల మధ్య పోటీ నెలకొంది. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ ఉంటుందని మొదట్లో అంతా భావించారు. అయితే అనుహ్యంగా బీజేపీ సైతం ప్రచారం చివరి దశలో పుంజుకుంది.

### అన్ని పార్టీలకు కీలకం

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలుపు అన్ని పార్టీలకు కీలకం. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఈ స్థానాన్ని గెలుచుకుంటే స్థానిక ఎన్నికల్లో లాభం చేకూరుతుంది. ఒకవేళ ఓడిపోతే ఈ రెండేళ్ల పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని భావించాల్సి ఉంటుంది. దీంతో ఈ ఎన్నికలను ఆ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. అధికారంలో ఉన్న పార్టీ కావడం, బలమైన సామాజిక వర్గానికి చెందిన నేతను బరిలోకి దింపడం కాంగ్రెస్‌కు కలిసి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా నియోజకవర్గంలో మైనారిటీ ఓట్లు అధికంగా ఉన్నాయి. దీంతో కాంగ్రెస్ ఎంఐఎం సపోర్టు తీసుకోవడంతో పాటు, అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చింది. ఈ చర్యలతో ఆ వర్గం ఓట్లు పడితే కాంగ్రెస్ గెలిచే అవకాశం ఉంది.

### 'సానుభూతి'దక్కేనా..!

బీఆర్ఎస్ తన సిట్టింగ్ స్థానాన్ని కైవసం చేసుకోవాలని ఆది నుంచి పక్కా ప్రణాళికతో ముందుకు సాగింది. సానుభూతి కలిసి వస్తుందని మాగంటి గోపీనాథ్ భార్యకు టికెట్ ఇచ్చింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు మొదట్లో జోరుగా ప్రచారం చేశారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ప్రచారంలో పాల్గొన్నారు. అయితే సానుభూతి కోసం సునీతకు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చింది. కానీ ఇటీవల మాగంటి గోపీనాథ్ తల్లి కేటీఆర్‌పై ఆరోపణలు చేశారు. దీంతో సానుభూతి పనిచేస్తుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. కాగా.. మైనారిటీ ఓట్లు చీలడంతో పాటు సెటిలర్ల ఓట్లు పడితే బీఆర్ఎస్ గట్టెక్కే అవకాశం ఉంది.

### ఏర్పాట్లు పూర్తి

ఉప ఎన్నికల బరిలో 58 మంది అభ్యర్థులు ఉన్నారు. నియోజకవర్గంలో 4,01,365 మంది ఓటర్లు ఉన్నారు. గతంలో 50 శాతంలోపే ఓటింగ్ జరిగింది. ఉప ఎన్నిక కావడం, అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ఈ సారి 60శాతం వరకు పోలింగ్ జరిగే అవకాశం ఉంది. మొత్తం 407 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 226 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించారు. పోలీసులు, పారా మిలిటరీ బలగాలతో బందోబస్తు నిర్వహించనున్నారు. 2,060 మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు.

### బండి రాకతో ఊపు

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ఆది బీజేపీ లైట్ తీసుకున్నట్లు ప్రచారం జరిగింది. అభ్యర్థిని ఆలస్యంగా ఖరారు చేయడంతో ప్రచారంలో కూడా జోరు చూపించలేదు. మీటింగ్‌లు, రోడ్ షోలు కూడా ఎక్కువగా నిర్వహించలేదు. దీనికి తోడు ప్రధాన నేతలు ప్రచారానికి దూరంగా ఉన్నారు. దీంతో ఆ పార్టీ పోటీలో లేదని, కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే పోటీ ఉంటుందని భావించారు. అయితే కేంద్ర మంత్రి బండి సంజయ్ బోరబండ సమావేశంతో ఆ పార్టీకి ఊపు వచ్చింది. ఆయన హిందు ఓట్లను సంఘటితం చేసేలా వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో హిందువుల ఓట్లు గంపగుత్తగా పడితే బీజేపీ గెలిచే అవకాశం ఉంది.

## కూలిన ఇంటి పైకప్పు.. కుటుంబం దుర్మరణం


**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బీహార్ రాష్ట్రంలోని పాట్నా జిల్లా దానాపూర్ ప్రాంతంలో పెను విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు నిద్రిస్తుండగా పాత ఇంటి పైకప్పు కూలిపోవడంతో అక్కడికక్కడే మరణించారు. వివరాల్లోకి వెళ్తే.. దానాపూర్ పరిధిలోని ఓ గ్రామంలో నివసిస్తున్న కుటుంబం ఆదివారం రాత్రి భోజనం చేసి పడుకుంది. ఆ సమయంలో పాతబడి, శిథిలావస్థకు చేరిన వారి ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. పైకప్పు కింద చిక్కుకుపోయిన కుటుంబ సభ్యులు ఊపిరాడక నిద్రలోనే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో మంగళ్ మండల్ (45), అతని భార్య కవితా దేవి (40), వారి ముగ్గురు పిల్లలు సోనూ (15), మోనూ (12), ఓ చిన్నారి పాప ఉన్నట్లు సమాచారం.

## దగ్గుమందు కంపెనీలకు కేంద్ర అల్టిమేటం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** 'కోల్డ్‌రిఫ్' దగ్గు మందు కారణంగా ఇటీవల చిన్నారులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం ఔషధ తయారీదారులకు కేంద్ర ప్రభుత్వం అల్టిమేటం ఇచ్చింది. జనవరి ఒకటి నాటికి అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాలని ఆదేశించింది. లేకపోయినట్లయితే కంపెనీలు మూసుకోవాల్సిందేనని హెచ్చరించింది. ఈ మేరకు సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఆదేశాలిచ్చింది. జనవరి ఒకటి నాటికి ఔషధ తయారీసంస్థలు గ్లోబల్ గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీసెస్‌కు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేసింది. ఈ తేదీలో ఎలాంటి పొడిగింపులు ఉండవని తేల్చిచెప్పింది.

## నేలకొరిగిన సాహితీ శిఖరం..

## అందెశ్రీ కన్నుమూత



**అక్షరటుడే, హైదరాబాద్ :** ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ గొంతు మూగబోయింది. చికిత్స పొందుతూ ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. తన రచనలు, పాటలతో తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసిన అందెశ్రీ ఆదివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురై తన ఇంట్లో కుప్పకూలారు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందారు.

అందెశ్రీ 1961 జూలై 18న సిద్దిపేట జిల్లా రేబర్తిలో జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. చిన్న వయసులోనే అనాథగా పెరిగిన ఆయన తల్లిదండ్రులు ఎవరో కూడా తెలియదు. జీవనం కోసం కొన్నాళ్లు గొర్రెల కాపరిగా పనిచేశారు. అదే సమయంలో కవిత్వం, గీతరచన వైపు ఆకర్షితమయ్యారు. చదువు లేకపోయినా తన ప్రతిభతో తెలుగు సాహిత్యంపై అద్భుతమైన పట్టు సాధించారు. అనంతరం కాకతీయ విశ్వవిద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది.

### ఆ పాటతో గుర్తింపు

"మాయమైపోతున్నడమ్మ మనిషన్నవాడు" పాట అందెశ్రీకి గుర్తింపును తెచ్చింది. తెలంగాణ ఉద్యమంలో అందెశ్రీ పాటలు ఉద్యమకారుల్లో ఉత్సాహం నింపాయి. ముఖ్యంగా ఆయన రాసిన "జయ జయహే తెలంగాణ జననీ జయ కేతనం" గీతం ఉద్యమానికి ప్రతీకగా నిలిచింది. ఆ గీతమే తరువాత తెలంగాణ అధికారిక రాష్ట్ర గీతంగా ఎంపిక కావడం ఆయనకు చిరస్మరణీయ గౌరవాన్ని తెచ్చింది. 2007లో వచ్చిన గంగ చిత్రంలోని పాటలకు అందెశ్రీ ఉత్తమ గీత రచయితగా నంది అవార్డు అందుకున్నారు. అలాగే 'ముత్యాల ముగ్గు', 'విచిత్రం' వంటి చిత్రాల్లో ఆయన రాసిన పాటలు తెలుగు సినీ సంగీత చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించాయి. ఆయన 2015లో దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం పొందారు. 2022లో జానకమ్మ జాతీయ పురస్కారం, 2024లో దాశరథీ కృష్ణమాచార్య సాహితీ పురస్కారం పొందారు. కాగా.. అందెశ్రీ మృతిపై పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్, పలువురు రాజకీయ నాయకులు నివాళులర్పించారు. అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది.

## భారత్‌లో అమ్ముడు పోని టెస్లా కార్లు




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ప్రపంచ ధనవంతుడు ఎలన్ మస్క్ టెస్లా కార్లకు భారత్‌లో గిరాకీ కరువైంది. ఈ సంస్థ భారత్‌లో జులైలో అమ్మకాలను ప్రారంభించింది. అయితే భారీ రేట్లు ఉండే ఈ కార్లకు దేశంలో డిమాండ్ లేదు. ఇప్పటి వరకు టెస్లా 104 కార్లను మాత్రమే విక్రయించింది. దేశంలో ఇటీవల ఆటో మొబైల్ రంగం జోరందుకుంది. దీంతో అక్టోబర్ నెలలో రికార్డు స్థాయిలో కార్ల విక్రయాలు చోటు చేసుకున్నాయి. అదే సమయంలో ఎలన్ మస్క్‌కు చెందిన టెస్లా కార్లపై భారతీయులు ఆసక్తి చూపడం లేదు. గత అక్టోబర్‌లో టెస్లా 40 కార్లను మాత్రమే విక్రయించింది. దీంతో మొత్తం అమ్మకాలు 104 యూనిట్లకు చేరుకున్నాయి. ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ లెక్కల ప్రకారం.. దేశవ్యాప్తంగా అక్టోబర్‌లో 18,055 ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలు జరిగాయి. ఇందులో టెస్లా కార్లు 40 మాత్రమే ఉండడం గమనార్హం.

## వన్‌ప్లస్ నుంచి మరో ఫోన్

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ అయిన వన్‌ప్లస్ కొత్త మోడల్‌ను తీసుకువస్తోంది. తన ఫ్లాగ్‌షిప్ స్మార్ట్ ఫోన్ అయిన వన్‌ప్లస్ 15 మోడల్‌ను ఇప్పటికే చైనాలో లాంచ్ చేసింది. వన్‌ప్లస్ 13కు కొనసాగింపుగా వన్‌ప్లస్ 15 తీసుకువచ్చింది. మధ్యలో వన్‌ప్లస్ 14ను కంపెనీ స్కిప్ చేసింది. భారత్‌లో స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ జెన్ 5 ప్రాసెసర్‌ను వినియోగిస్తున్న మొదటి మోడల్ ఇదేనని కంపెనీ పేర్కొంటోంది. భారతదేశంలో గురువారం రాత్రి 7 గంటలకు విడుదల చేయనుంది. అదే రోజు రాత్రి 8 గంటలకు అమ్మకాలు ప్రారంభమవుతాయి.

## ఆస్ట్రేలియా సంచలన నిర్ణయం

### 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఆన్‌లైన్ భద్రత, డిజిటల్ హెల్త్ పరిరక్షణ కోసం ఆస్ట్రేలియా ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. 2025 డిసెంబర్ 10వ తేదీ నుంచి 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వాడకాన్ని పూర్తిగా నిషేధించే చట్టాన్ని ఆమోదించింది. ఈ విషయాన్ని ఆ దేశ ప్రధాని ఆంథోనీ అల్బనీస్ అధికారికంగా ప్రకటించారు. ఈ నిర్ణయంతో ఆస్ట్రేలియా ప్రపంచంలోనే మొట్టమొదటి దేశంగా ఇలాంటి చట్టాన్ని అమలు చేయబోతోంది. కొత్త చట్టం ప్రకారం.. 16 ఏళ్లలోపు మైనర్లు ఇకపై ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్, స్నాప్‌చాట్, ఎక్స్, యూట్యూబ్, కిక్ వంటి ప్లాట్‌ఫాంలలో అకౌంట్లు క్రియేట్ చేయడం లేదా వాడడం చట్టవిరుద్ధం అవుతుంది.

తాజాగా రూపొందించిన చట్టంతో 16 ఏళ్లలోపు పిల్లలు తమ ప్లాట్‌ఫాంలలో అకౌంట్లు సృష్టించకుండా ఉండేందుకు ఆయా కంపెనీలు సమర్థవంతమైన వయస్సు ధ్రువీకరణ వ్యవస్థలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రూల్స్‌ను పాటించకపోతే, ఆ సోషల్ మీడియా సంస్థలకు గరిష్టంగా 49.5 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లు (సుమారు రూ.410 కోట్లు) వరకు భారీ జరిమానా విధించే అవకాశం ఉందని ప్రభుత్వం హెచ్చరించింది.

## ఇమాన్వికి ప్రభాస్ హోం ఫుడ్ ట్రీట్

పాన్‌ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ గురించి తెలిసిన వారికి ఆయన అతిథి సత్కారం ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయనను ఒకసారి కలిసిన వారు ప్రభాస్ ఇంటి వంటకాలను రుచి చూడకుండా వెళ్లరు. ఇప్పుడు ఆ జాబితాలో చేరింది నటి ఇమాన్వి పేరు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న "ఫౌజీ" సినిమా షూటింగ్‌లో ఇమాన్వి బిజీగా ఉంది. షూట్ మధ్యలో ప్రభాస్ తన ఇంట్లో వండిన రుచికరమైన ఆహారాన్ని ఆమెకు పంపారట. ఆ వంటకాల వైవిధ్యాన్ని చూసి ఇమాన్వి ఆశ్చర్యపోయింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆ ఫుడ్ ఫొటోను షేర్ చేస్తూ.. ప్రభాస్‌కు ధన్యవాదాలు తెలిపింది.

**- అక్షరటుడే, సినిమా డెస్క్**

